సాక్షి ఆదిలాబాద్

ఆదివారం । 26 । మార్చి । 2023



చౌక యాత్ర

స్నేహితులతో కలిసి ట్రెక్కింగ్ చేయాలని.. విభిన్న ప్రదేశాలను సందర్శించాలని అందరికీ ఉంటుంది. అది అనుకూల సమయంలో.. తక్కువ బడ్జెట్‌లో పూర్తి చేసేలా వైహెచ్ఏఐ తోడ్పాటు అందిస్తోంది. 8లో▸



రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
ఆది : 6:28	సోమ 4:52

గరిష్టం/కనిష్టం 36.0/22.0

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. గాలిలో తేమశాతం పెరగనుంది. అక్కడక్కడ జల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నేర నిర్ధారణలో వైద్యుల పాత్ర కీలకం



మాట్లాడుతున్న జిల్లా జడ్జి ఎంఆర్ సునీత

ఆదిలాబాద్‌టౌన్: నేర నిర్ధారణలో వైద్యుల పాత్ర కీలకమని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎంఆర్ సునీత అన్నారు. న్యాయ సేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో రిమ్స్ మెడికోలకు శనివారం న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నేరాలకు సంబంధించిన కేసులు పోలీసుల నమోదు నుంచి ప్రారంభమై కోర్టు తీర్పుతో ముగుస్తాయని, ఈ క్రమంలో వైద్యుల రిపోర్టు ఎంతో కీలకమవుతాయని పేర్కొన్నారు. చట్టాలు, కేసుల్లో వైద్యుల పాత్ర తదితర అంశాలను తెలియజేశారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు మా ధవీకృష్ణ, మంజుల, ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి, పీపీ రమణారెడ్డి, డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్, రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, మెడికోలు, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

మహాధర్నాలో ‘పాయల్’



ఆదిలాబాద్: టీఎస్పీఎస్సీ ప్రశ్నపత్రాల లీకేజీ వ్యవహారంపై బీజేపీ ఆధ్వర్యంలో శనివారం హైదరాబాద్‌లో నిర్వహించిన ‘మా నౌకరీలు మాగ్గావాలె’ మహా ధర్నాలో పార్టీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్ పాల్గొన్నారు. ఇందులో నాయకులు కొత్తపల్లి శ్రీనివాస్ తదితరులున్నారు.

నేడు నస్పూర్‌లో సీపీఐ సర్వసభ్య సమావేశం



వాల్ పోస్టర్ విడుదల చేస్తున్న నాయకులు

ఎదులాపురం: మంచిర్యాలలోని నస్పూర్‌లో ఆదివారం నిర్వహించనున్న ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా సీపీఐ సర్వసభ్య సమావేశాన్ని జయప్రదం చేయాలని పార్టీ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్‌రెడ్డి కోరారు. ఈమేరకు జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శనివారం సర్వసభ్య సమావేశానికి సంబంధించిన వాల్ పోస్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సమావేశం నేపథ్యంలో ముందుగా ఇందారం క్రాస్‌రోడ్ నుంచి నస్పూర్ కమ్యూనిటీ హాల్ వరకు బైక్ ర్యాలీ ఉంటుందన్నారు. అనంతరం నిర్వహించే సర్వసభ్య సమావేశానికి పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి,రాష్ట్ర కార్యదర్శి కె.సాంబశివరావు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కలవేని శంకర్ అతిథులుగా హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలోని పార్టీ కార్యకర్తలు, నాయకులు, అనుబంధ, రైతు సంఘాల నాయకులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర సమితి సభ్యురాలు నళిని రెడ్డి, నాయకులు అరుణ్ కుమార్, రాములు తదితరులు పాల్గొన్నారు.

భీంపూర్‌కు చేరిన పాదయాత్ర



స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు

తాంసి: సేవాలాల్ దీక్షాపరులు చేపట్టిన పాద్రయాత్ర శనివారం భీంపూర్ మండల కేంద్రానికి చేరుకుంది. జిల్లాలోని నార్నూర్ ప్రాంతం నుంచి మహారాష్ట్రలోని పొరఘడ్ వరకు సేవాలాల్ భక్తులు పాదయాత్ర చేపడుతారు. స్థానిక ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రేంసింగ్ మహరాజ్‌ను స్థానిక ప్రజాప్రతినిధులు సన్మానించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సుధాకర్, సర్పంచ్ లింబాజీ, ఉప సర్పంచ్ జాదవ్ రవీందర్, బలిరాం జాదవ్, మహేశ్, తారాచంద్ తదితరులు పాల్గొన్నారు.

29న జాబ్ మేళా

ఆదిలాబాద్‌అర్బన్: ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాలలో ఈనెల 29న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ సునీత తెలిపారు. టాస్క్ ఆధ్వర్యంలో ఉదయం 10:30 గంటలకు హెటిరో డ్రగ్స్ కంపెనీ వారు జూనియర్ కెమిస్ట్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. బీకాం, బీఎస్సీ, బీఎస్సీ (కెమిస్ట్రీ) చదివిన విద్యార్థులు సర్టిఫికెట్లతో హాజరుకావాలని కోరారు.

రిమ్స్‌లో ప్రక్షాళన

- స్టాఫ్ నర్సు విభాగం నుంచి ఆరుగురి మార్పు
- కార్యాలయం మూడో అంతస్తులోకి చేంజ్..
- ఆన్‌లైన్‌లో వివరాల నమోదు కోసం ఆపరేటర్ నియామకం



స్టాఫ్ నర్సుల విభాగాన్ని పరిశీలిస్తున్న డైరెక్టర్ జైసింగ్ రాథోడ్

సాక్షి ఎఫెక్ట్..

ఆదిలాబాద్‌టౌన్: ‘రిమ్స్‌లో కలెక్షన్ క్వీన్..’ శీర్షికన శనివారం ‘సాక్షి’లో ప్రచురితమైన కథనానికి డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ స్పందించారు. స్టాఫ్ నర్సుల విభాగాన్ని పరిశీలించి హాజరు పట్టికను తనిఖీ చేశారు. ‘సాక్షి’ కథనంపై ఆరా తీశారు. ఇక్కడేం జరుగుతుందంటూ సూపరింటెండెంట్‌తో పాటు పలువురు ఉద్యోగులపై మండిపడ్డారు. ఇలాంటి ఘటనలు పునరావృతమైతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనధికారికంగా విధులు నిర్వర్తిస్తున్న ఆరుగురిని అక్కడి నుంచి తప్పించారు. వెంటనే కేటాయించిన విధుల్లో చేరాలని ఆదేశించారు. వారికి మిగతా ఉద్యోగుల్లా విధులు కేటాయించాలని సూపరింటెండెంట్‌ను ఆదేశించారు. స్టాఫ్ నర్సులకు కూడా త్వరలోనే బయోమెట్రిక్ ఏర్పాటు చేయనున్నట్లు ఆయన వివరించారు. విధుల్లో నిర్లక్ష్యం వహించిన వారిపై కఠిన చర్యలుంటాయని పేర్కొన్నారు.

డాటా ఎంట్రీ ఆపరేటర్ నియామకం..

స్టాఫ్ నర్సులకు విధుల కేటాయింపు, ఇతర కార్యకలాపాలకు సంబంధించి ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు నమోదు చేసే విధంగా స్టాఫ్ నర్సు విభాగంలో డాటా ఎంట్రీ ఆపరేటర్‌ను నియమించారు. ప్రత్యేకంగా కంప్యూటర్ ఏర్పాటు చేశారు. హాజరు వివరాలను అందులో ఎప్పటికప్పుడు నమోదు చేసి తమకు అందజేయాలని డైరెక్టర్ అధికారులను ఆదేశించారు. ఎమర్జెన్సీ వార్డు సమీపంలో ఉన్న నర్సింగ్ విభాగాన్ని మూడో అంతస్తులోని సూపరింటెండెంట్ కార్యాలయం పక్కకు మార్చాలని ఆదేశించారు.

రిమ్స్‌లో తవ్వినకొద్దీ అక్రమాలే..

రిమ్స్‌లో తవ్విన కొద్దీ అక్రమాలు బయటకు వస్తున్నాయి. ఈ మేరకు ‘సాక్షి’కి పలువురు స్టాఫ్ నర్సులు తమ గోడు వెల్లబోసుకున్నారు. తమకు అనుకూలంగా ఉన్న కొందరికి ఏళ్ల తరబడి డే డ్యూటీ కేటాయిస్తున్నారని, తమకు మాత్రం రాత్రి విధులు కేటాయిస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని పేర్కొన్నారు. బ్లడ్ బ్యాంక్‌లో పనిచేసే ఓ స్టాఫ్ నర్సుకు దాదాపు రెండేళ్లుగా డే డ్యూటీ మాత్రమే కేటాయిస్తున్నట్లు తెలిపారు. నిబంధనల మేరకు అందరికీ సమానంగా విధులు కేటాయించాలని వారు కోరుతున్నారు.

డబ్బులివ్వద్దని ఫ్లెక్సీల ఏర్పాటు...

రిమ్స్‌లోని పలు వార్డుల్లో డబ్బులు ఇవ్వద్దని ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. అన్ని రకాల సేవలు ఉచితం.. ఎవరైనా డబ్బులు అడిగితే ఆర్ఎంవో 9440902142 నంబర్‌కు ఫిర్యాదు చేయాలని అందులో పేర్కొన్నారు. డబ్బులివ్వడం.. తీసుకోవడం నేరమని పొందుపర్చారు. ఎవరైనా డబ్బులు డిమాండ్ చేస్తే నేరుగా తనకు ఫిర్యాదు చేయాలని రిమ్స్ డైరెక్టర్ తెలిపారు.



రిమ్స్‌లో డబ్బులివ్వొద్దని ఏర్పాట్లు చేసిన ఫ్లెక్సీ

బీఆర్ఎస్.. ‘ఆత్మీయ’ం

- సీఎం కేసీఆర్ సందేశం నేపథ్యంలో..
- ఎన్నికలకు కేడర్‌ను సన్నద్ధం చేయడమే లక్ష్యం
- సంక్షేమాన్ని వివరిస్తూ.. విపక్షాలను ఎదుర్కొనేలా..
- జిల్లాలో కార్యకర్తలతో సమావేశాలు షురూ



తలమడుగు మండలం కజ్జర్లలో మాట్లాడుతున్న పార్టీ ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల ఇన్‌చార్జి వి.గంగాధర్ గౌడ్

సాక్షి,ఆదిలాబాద్: ఎన్నికల ఏడాదిగా పరిగణిస్తున్న నేపథ్యంలో కేడర్‌ను అన్నివిధాలా సంసిద్ధులను చేయడమే లక్ష్యంగా బీఆర్ఎస్ కదులుతుంది. విపక్షాలను ధీటుగా ఎదుర్కొంటూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ఎంత మందికి లబ్ధి చేకూరిందన్నది కేడర్ ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు సిద్ధమయ్యారు. ‘బీఆర్ఎస్‌కు కార్యకర్తలే బలం.. బలగం.. అంటూ సీఎం కేసీఆర్ పార్టీ శ్రేణులకు ఇటీవల ఆత్మీయ సందేశం విడుదల చేసిన తర్వాత పార్టీ ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళనాలకు శ్రీకారం చుట్టింది.

మొదలైన సమ్మేళనాలు..


జిల్లాలో బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనాలు మొదలయ్యాయి. బోథ్ నియోజకవర్గంలోని తలమడుగు మండలం కజ్జర్ల, ఖానాపూర్ నియోజకవర్గ పరిధిలోని ఉట్నూర్ మండలం శ్యాంపూర్‌లో శనివారం వీటిని ప్రారంభించారు. ఆదిలాబాద్, ఆసిఫాబాద్ నియోజకవర్గాల్లోనూ వీటిని చేపట్టనున్నారు. జిల్లాలో సుమారు 75 వరకు సమ్మేళనాలు నిర్వహించాలని భావిస్తున్నారు. పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల ఇన్‌చార్జి వి.గంగాధర్ గౌడ్ ఆధ్వర్యంలో వీటిని మొదలుపెట్టారు. ఆయా నియోజకవర్గాల్లో బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావు, ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్‌తో పాటు జిల్లాకు చెందిన ముఖ్య నాయకులు పాల్గొన్నారు. ప్రధానంగా కొన్ని గ్రామాలను కలిపి ఈ సమ్మేళనాలను నిర్వహిస్తున్నారు. ఆయా గ్రామాల పార్టీ కార్యకర్తలు ఇందులో పాల్గొంటారు. గ్రామాల్లో సమ్మేళనాల నిర్వహణకు సంబంధించి ఆయా ఎమ్మెల్యేల ఆధ్వర్యంలో ప్రణాళిక రూపొందిస్తున్నారు.

లక్ష్యాలను నిర్దేశిస్తూ..

సమ్మేళనంలో పాల్గొన్న నేతలు కార్యకర్తల ముందు లక్ష్యాలను నిర్దేశిస్తున్నారు. ప్రధానంగా బీజేపీ, కాంగ్రెస్ చేస్తున్న దుష్ప్రచారాలను తిప్పికొట్టాలని వివరిస్తున్నారు. రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాల పరంగా ప్రతిపక్ష పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రంలో ఎందుకు అమలు చేయలేకపోతున్నారని ప్రశ్నించాలంటూ సూచిస్తున్నారు. అదే సందర్భంగా ప్రజల దగ్గరకు వెళ్లాలని, ఇంటింటికి వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల తీరును వివరిస్తూ రాబోయే రోజుల్లోనూ బీఆర్ఎస్ ప్రజల సంక్షేమం కోసం పాటు పడుతుందని వివరించాలని చెబుతున్నారు. రైతుబంధు, రైతుబీమా, దళితబంధు, కల్యాణలక్ష్మి, షాదీముబారక్, త్వరలో సొంత జాగా ఉన్న వారికి ఇళ్ల నిర్మాణం కోసం చేసే సాయం వంటి వాటిపై విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్యకర్తలకు సూచిస్తున్నారు. ప్రధానంగా ఈ ఏడాది ఎన్నికలు ఎప్పుడైనా రావచ్చనే ప్రచారం నేపథ్యంలో కార్యకర్తలను సమ్మేళనాల ద్వారా సుశిక్షితులను చేసి అటు ప్రతిపక్షాలను ఎండగడుతూ.. మరో వైపు ప్రజల దగ్గరకు వెళ్లేలా తర్ఫీదు ఇస్తుంది బీఆర్ఎస్.

కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తే..డిప్యూటేషన్!

- బాధితులపైనే వేటు
- డీపీఆర్వో కార్యాలయం నుంచి ఇద్దరు మహిళా ఉద్యోగుల రిలీవ్



రిలీవ్ చేస్తూ డీపీఆర్వో జారీ చేసిన ఉత్తర్వు

కైలాస్‌నగర్: జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ (డీపీఆర్వో) కార్యాలయంలో పనిచేసే ఇద్దరు మహిళా ఉద్యోగులను కలెక్టరేట్‌కు డిప్యూటేషన్‌పై పంపించడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. డీపీఆర్వో తమను మానసికంగా వేధింపులకు గురిచేస్తున్నారని పేర్కొంటూ ఆఫీస్ సబార్డినేట్ భారతి, సాంకేతిక సబార్డినేట్ రజియా బేగం ఇటీవల కలెక్టర్ రాహుల్‌రాజ్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో ఏం జరిగిందో తెలియదు కానీ వారిద్దరిని కలెక్టర్ కార్యాలయానికి డిప్యూటేషన్‌పై పంపించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు డీపీఆర్వో ఉత్తర్వులు జారీ చేయడం గమనార్హం. ఈ మేరకు వారు డీపీఆర్వో కార్యాలయం నుంచి రిలీవై కలెక్టరేట్‌లో విధుల్లో చేరారు. కాగా, బాధితులు న్యాయం చేయమని వేడుకుంటే డిప్యూటేషన్‌పై పంపడంపై అధికార వర్గాల్లో చర్చనీయాంశమైంది.

మహిళలు అన్నిరంగాల్లో రాణించాలి

- జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్



ట్రాక్టర్ అందజేస్తున్న జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్

నార్నూర్: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్ అన్నారు. మండల కేంద్రంలోని సరస్వతి మండల సమాఖ్య సీఎస్‌సీని శనివారం ప్రారంభించి సబ్సిడీపై మంజూరైన ట్రాక్టర్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మహిళల అభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా కృషి చేస్తుందన్నారు. ట్రాక్టర్‌ను సద్వినియోగం చేసుకుని ఆర్థికాభివృద్ధి సాధించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మోతుబాయి, తహసీల్దార్ మోతీరాం, మండల సమాఖ్య అధ్యక్షురాలు సత్యశీల, ఏపీఎం రమేశ్, తదితరులున్నారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న పెన్షనర్లు

ఆదిలాబాద్‌అర్బన్: పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ నాయకులు కలెక్టర్ రాహుల్‌రాజ్‌ను కోరారు. ఈమేరకు శనివారం కలెక్టర్ కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.శశికాంత్, జగన్మోహన్ మాట్లాడారు. ప్రతి నెలా ఒకటో తేదీనే పెన్షన్లు చెల్లించాలని, బకాయిపడ్డ కరువు భత్యం వాయిదాలు చెల్లించాలని, జూలై 1,2023 నుంచి వర్తించేలా పీఆర్సీ వేయాలని, పెన్షనర్లకు అన్ని కార్పొరేట్ ఆసుపత్రుల్లో నాణ్యమైన నగదు రహిత వైద్యం అందించాలని, మూడు నెలల్లోగా మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లులు చెల్లించాలని కోరారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో గౌరవాధ్యక్షుడు దయాకర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు ఉమకాంత్, రాజవర్ధన్, దేవిదాస్, గంగాధర్, సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేస్తున్న కేంద్రం

- డీసీసీ అధ్యక్షుడు సాజిద్‌ఖాన్



కాంగ్రెస్ ఎస్టీ విభాగం నాయకులతో సాజిద్‌ఖాన్

ఆదిలాబాద్‌అర్బన్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం స్వయం ప్రతిపత్తి సంస్థలైన సీబీఐ, ఈడీ వంటి వాటిని దుర్వినియోగం చేస్తుందని డీసీసీ అధ్యక్షుడు సాజిద్‌ఖాన్ ఆరోపించారు. పట్టణంలోని తన నివాసంలో జిల్లా ఎస్టీ సెల్ విభాగంలో పలువురికి బాధ్యతలు అప్పగిస్తూ శనివారం నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ ఆరాచకాలు రోజురోజుకు పెరుగుతున్నాయన్నారు. ప్రధాని మోదీ తన మిత్రుడైన అదానీకి దేశ సంపదను దోచిపెట్టడాన్ని పార్లమెంట్ సాక్షిగా ప్రశ్నించిన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై కక్షగట్టి పార్లమెంట్ సభ్యత్వంను రద్దు చేయడాన్ని ఖండించారు. కార్యక్రమంలో నాయకులు శ్రీధర్ తదితరులు ఉన్నారు.

‘ఉపాధి’కి దక్కని హామీ!

- సకాలంలో అందని కూలి
- పూర్తికాని జాబ్‌కార్డు, ఆధార్ అనుసంధాన ప్రక్రియ
- పనులపై ఆసక్తి చూపని కూలీలు

వివరాలు..	
జిల్లాలో గ్రామ పంచాయతీలు	468
జాబ్‌కార్డుల సంఖ్య	1.68లక్షలు
‘ఉపాధి హామీ’లో నమోదైన కూలీలు	3.37 లక్షలు
యాక్టివ్ జాబ్ కార్డుల సంఖ్య	1.11లక్షలు
యాక్టివ్ కూలీల సంఖ్య	2.08లక్షలు
పనులకు హాజరవుతున్న కూలీలు	22,241



భీంపూర్ మండలం మర్కగూడలో ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలు

కైలాస్‌నగర్: గ్రామాల్లో వంద రోజుల పాటు పని కల్పించాలనే ఉద్దేశంతో అమలు చేస్తున్న మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కూలీలకు భరోసా ఇవ్వడం లేదు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన సంస్కరణలు ఈమేరకు ప్రభావం చూపుతున్నట్లు తెలుస్తోంది. జాబ్‌కార్డులు, బ్యాంకుఖాతాలు ఆధార్‌తో అనుసంధానం కాకపోవడంతో కొందరు ఉపాధి పనులకు దూరమవుతున్నారు. అనుసంధానమై పనులకు వెళ్లిన వారికి సైతం వారాల తరబడి కూలి అందకపోవడంతో పలువురు పనులపై ఆసక్తి చూపడం లేదు. కూలీలకు పని కల్పించేలా చూడాల్సిన క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బంది ఆ దిశగా దృష్టి సారించకపోవడంతో చాలా మంది ఉపాధికి దూరమవుతున్నట్లు తెలుస్తోంది.

పనులు చేస్తున్నది 22వేల మందే

జిల్లా వ్యాప్తంగా సుమారు 2లక్షల మంది యాక్టివ్ ఉపాధి కూలీలుగా నమోదై ఉన్నారు. వీరంతా రెగ్యులర్‌గా పనులకు హాజరవుతుంటారు. కానీ ప్రస్తుతం కేంద్ర నిబంధనలు, కూలి చెల్లింపుల్లో జాప్యం కారణంగా పనులకు హాజరయ్యేవారి సంఖ్య గణనీయంగా తగ్గుతుంది. జిల్లాలో కేవలం 22వేల 241 మంది మాత్రమే పనులకు హాజరవుతున్నారు. ప్రతీ గ్రామంలో కనీసం వంద మందికి పనులు కల్పించాలనేది ప్రభుత్వ లక్ష్యం. కానీ ఇది నెరవేరడం లేదు. ఒక్కో గ్రామంలో పది నుంచి 20 మంది కూలీలు మాత్రమే పనులకు వెళుతున్నారు. ప్రస్తుతం అత్యధికంగా ఇంద్రవెల్లి మండలంలో 2,326 మంది కూలీలు పనిచేస్తుండగా, అత్యల్పంగా జైనథ్ మండలంలో కేవలం 278 మంది మాత్రమే హాజరవుతుండటం ఉపాధి పనుల పరిస్థితికి అద్దం పడుతుంది. మండల, గ్రామస్థాయిలో కూలీలను ప్రోత్సహించి పనులకు హాజరయ్యేలా చూడాల్సిన అధికారులు తమకేం పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలున్నాయి.

కలెక్టర్ ఆదేశించినా కన్పించని మార్పు

ఈ నెల 21న జిల్లాలోని ఎంపీడీవోలు, డీఆర్డీఏ అధికారులతో కలెక్టర్ రాహుల్‌రాజ్ సమీక్ష నిర్వహించారు. ఉపాధి హామీ పథకంలో కూలీల సంఖ్య పెంచాలని ఆదేశించారు. ప్రతీ గ్రామంలో కనీసం 50 మందికి తగ్గకుండా పనులు కల్పించాలని ఆదేశించారు. అయినా పరిస్థితిలో మార్పు రావడం లేదు. కూలీల సంఖ్య పెరగాల్సింది పోయి రోజురోజుకు తగ్గుతుండటం అధికారుల పర్యవేక్షణ, పనితీరుకు నిదర్శనంగా నిలుస్తోంది. అయితే కూలీల బ్యాంక్ ఖాతా, జాబ్‌కార్డులకు ఆధార్ అనుసంధాన ప్రక్రియ పూర్తి కాకపోవడంతో కూలీలు పనిచేసినా వేతనాలు అందని పరిస్థితి ఉందని అధికారులు చెబుతున్నారు. మరోవైపు వేతన చెల్లింపుల్లో జాప్యంతోనే పనులకు రావడం లేదని పలువురు కూలీలు చెబుతుండటం విశేషం.

లక్ష్యానికి అనుగుణంగా చర్యలు

ప్రతీ గ్రామంలో 50 మంది కూలీలకు పనులు కల్పించాలనేది ప్రభుత్వ లక్ష్యం. ఆ దిశగానే పనులను కల్పిస్తున్నాం. ప్రస్తుతం జిల్లాలో 22వేల మంది కూలీలు పనులకు హాజరువుతున్నారు. పని కల్పించడంలో జిల్లా రాష్ట్రంలోనే ఐదో స్థానంలో ఉంది. కూలి చెల్లింపుల్లోనూ ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తున్నాం.

– ఎస్.కిషన్, డీఆర్డీవో

ప్రస్తుతం మండలాల వారీగా ఉపాధి పనులకు హాజరవుతున్న కూలీలు

మండలం	హాజరవుతున్న కూలీలు
ఇంద్రవెల్లి	2326
నార్నూర్	1838
మావల	205
నేరడిగొండ	1854
బజార్‌హత్నూర్	1580
ఇచ్చోడ	1672
గాదిగూడ	1297
ఉట్నూర్	1834
బోథ్	1618
ఆదిలాబాద్	1634
సిరికొండ	895
గుడిహత్నూర్	1217
తాంసి	599
భీంపూర్	991
తలమడుగు	1046
బేల	1357
జైనథ్	278

అట్టహాసంగా ‘యువ ఉత్సవ్’



నృత్య ప్రదర్శనలో విద్యార్థినులు



విజేతలకు బహుమతి ప్రదానం చేస్తున్న ట్రెయినీ కలెక్టర్ శ్రీజ

జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన జిల్లా స్థాయి యువ ఉత్సవ్ అట్టహాసంగా కొనసాగింది. కార్యక్రమానికి ట్రెయినీ అసిస్టెంట్ కలెక్టర్ శ్రీజ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వ్యక్తిత్వ నిర్మాణంలో విద్యార్థి దశ ఎంతో కీలకమని తెలిపారు. యువత సామాజిక దృక్పథం అలవర్చుకోవాలన్నారు. అలాగే చదువుతోపాటు సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనాలని సూచించారు. అనంతరం పెయింటింగ్, ఫొటోగ్రఫీ, రైటింగ్, నృత్య విభాగాల్లో పోటీలు నిర్వహించగా, విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో నెహ్రూ యువ కేంద్రం కోఆర్డినేటర్ సునీల్ బడ్, ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జగ్‌రామ్, ప్రభుత్వ ఆర్ట్స్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ అనిత, అధ్యాపకులు పాల్గొన్నారు. – ఆదిలాబాద్

క్లుప్తంగా

27న ఈపీఎఫ్‌పై అవగాహన సదస్సు

కైలాస్‌నగర్‌: ఉద్యోగుల భవిష్యనిధి సంస్థ ఆధ్వర్యంలో నిధి ఆప్కే నికత్‌–2.0 (భవిష్య నిధి మీ వద్దకు) అంశంపై ఈ నెల 27న ఉమ్మడి ఆదిలాబాద్‌ జిల్లా వ్యాప్తంగా అవగాహన, ఔట్‌రీచ్‌ ప్రోగ్రాం నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ అసిస్టెంట్‌ కమిషనర్‌ పి.సుబ్రమ్మణ్యం శనివారం తెలిపారు. ఆదిలాబాద్‌ జిల్లా కేంద్రంలో డీఆర్‌డీఏ కాన్ఫరెన్స్‌ హాల్‌, మంచిర్యాల జిల్లాకు సంబంధించి దేవాపూర్‌లోని ఓరియంట్‌ సిమెంట్‌ ఫ్యాక్టరీ మీటింగ్‌హాల్‌లో, ఆసిఫాబాద్‌ జిల్లాకు సంబంధించి కాగజ్‌నగర్‌ మున్సిపల్‌ కార్యాలయంలో, నిర్మల్‌ జిల్లా కేంద్రంలోని మున్సిపల్‌ కార్యాలయంలో ఈ సమావేశాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 5.45 గంటల వరకు కార్యక్రమాల్లో సంబంధిత జిల్లాల పరిధిలోని కార్మిక సంఘాలు, యువజనుల ఫిర్యాదులను పరిష్కరించుకోవడంతో పాటు తగు సలహాలు, సూచనలు చేయవచ్చన్నారు. ఈ అవకాశాన్ని వారు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

విద్యార్థులు కష్టపడి చదవాలి



మాట్లాడుతున్న కుమ్ర ఈశ్వరీబాయి

బేల: విద్యార్థులు కష్టపడి చదవాలని రాష్ట్ర మహిళా కమిషన్‌ సభ్యురాలు కుమ్ర ఈశ్వరీబాయి అన్నారు. శనివారం రాత్రి మండల కేంద్రంలోని ప్రభుత్వ గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలలో నిర్వహించిన వార్షికోత్సవానికి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధిస్తే తన వంతుగా ప్రత్యేక ప్రోత్సాహక బహుమతులు అందిస్తానని తెలిపారు. అనంతరం విద్యార్థులు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌ ఇంద్రశేఖర్‌, హెచ్‌ఎం జ్యోతిరాం, ఉపాధ్యాయులు, ఆయా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

'ఏలేటి'పై కేసు నమోదు

నిర్మల్‌చైన్‌గేట్‌: రాష్ట్ర దేవాదాయ, న్యాయ, అటవీశాఖ మంత్రి ఇంద్రకరణ్‌ రెడ్డిపై ఈనెల 21వ తేదీన విలేకరుల సమావేశంలో ఆధారాలు లేకుండా ఆరోపణలు చేసిన ఏఐసీసీ కార్యక్రమాల అమలు కమిటీ చైర్మన్‌ ఏలేటి మహేశ్వర్‌రెడ్డిపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో బీఆర్‌ఎస్‌ పార్టీ పట్టణ అధ్యక్షుడు మారుగొండ రాము శనివారం ఫిర్యాదు చేశాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్మల్‌ మున్సిపాలిటీలో 42 ఉద్యోగాలను మంత్రి అమ్ముకున్నారని అసత్య ఆరోపణలు చేసి మంత్రి పరువు ప్రతిష్ట దెబ్బతినేలా చేశాడని, అందుకే ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నాడు. కేసు నమోదు చేసినట్లు సీఐ మల్లేష్‌ తెలిపారు.

పంట పొలంలోకి కొండగొర్రె



అధికారులకు కొండగొర్రెను ఇస్తున్న రైతు

సారంగాపూర్‌: మండలంలోని దుప్యాతండా గ్రామానికి చెందిన రైతు సవాయిరాం పంటపొలంలోకి శనివారం కొండగొర్రె పిల్ల దారి తప్పి వచ్చింది. గమనించిన రైతు పట్టుకుని గ్రామంలోకి తీసుకొచ్చాడు. స్థానికులు అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వడంతో డెప్యూటీ రేంజ్‌ అధికారిణి శ్రీదేవి, ఎఫ్‌బీవో రాజసింధు చేరుకుని కొండగొర్రె పిల్లను నిర్మల్‌ జిల్లా కేంద్రంలోని అటవీశాఖ కార్యాలయానికి తరలించారు.

చౌక యాత్ర

- తక్కువ బడ్జెట్‌లోనే పర్యాటకం
- కలిసి వస్తున్న కొత్త సహ యాత్రికులు
- ఔత్సాహికుల కోసం వెబ్‌సైట్‌

స్నేహితులతో కలిసి ట్రెక్కింగ్‌ చేయాలని.. విభిన్న ప్రదేశాలను సందర్శించాలని.. పర్యాటక ప్రాంతాలకు వెళ్లాలని అందరికీ ఉంటుంది. కానీ కొందరి అడుగే ముందుకు పడుతుంది. ఆర్థికంగా భారమని భావించడం.. కలిసి రావడానికి స్నేహితులకు సమయం కుదరకపోవడం వల్ల మరికొందరి పర్యటన వాయిదా పడుతూనే ఉంటుంది. అతి తక్కువ బడ్జెట్‌లోనే.. మనకు వీలైన సమయానికి కొత్త సహ పర్యాటకులతో పర్యటన పూర్తయితే ఆ ఆనందమే వేరు. అలాంటి ఔత్సాహికుల కోసం వైహెచ్‌ఏఐ (యూత్‌ హాస్టల్స్‌ అసోసియేషన్‌ ఆఫ్‌ ఇండియా) తోడ్పాటు అందిస్తోంది.

– సాక్షి, మంచిర్యాలడెస్క్‌

ఇదీ వెబ్‌సైట్‌:
https:// www. yhaindia. org



గోవాలో ట్రెక్కింగ్‌కు హాజరైన వివిధ రాష్ట్రాల పర్యాటకులు

వైహెచ్‌ఏఐ లక్ష్యం..

ప్రయాణం, పర్యాటకం, సాహస యాత్రలకు తక్కువ ధరలో తోడ్పాటు అందించడం, సామాజిక, అభివృద్ధి, సమస్యలపై యువతలో అవగాహన పెంపొందించడం వైహెచ్‌ఏఐ లక్ష్యం. ఇంగ్లాండ్‌లోని హాస్టలింగ్‌ ఇంటర్నేషనల్‌లో వైహెచ్‌ఏఐ సభ్యత్వం కలిగి ఉంది. దేశవ్యాప్తంగా 95 యూత్‌ హాస్టళ్లు కలిగి ఉంది. ఈ హాస్టళ్లలో వైహెచ్‌ఏఐ సభ్యులకు తక్కువ ధరలో వసతి, శాకాహార భోజన సౌకర్యాలు కల్పిస్తారు. వైహెచ్‌ఏఐ జాతీయ చైర్మన్‌ వెంకటనారాయణ్‌ ఆధ్వర్యంలో అన్ని చోట్ల కార్యకలాపాలకు ఏర్పాట్లు చేస్తున్నారు. దేశంలో ఇప్పటికే సొంతంగా ఎనిమిది హాస్టళ్లు ఉన్నాయి. కొత్తవి కూడా నిర్మిస్తున్నారు. ఇందులో భాగంగా దాతల సహకారంతో హిమాచల్‌ప్రదేశ్‌లోని కసోల్‌లో కూడా హాస్టల్‌ నిర్మాణం చేపట్టారు. హిమాచల్‌ప్రదేశ్‌ వంటి రాష్ట్రాల్లో ఆహారానికి ఇబ్బందులు పడకుండా ఇటీవల దక్షిణ భారతదేశ యాత్రికుల కోసం ఇడ్లీ, పొంగల్‌, కిచిడీ, వెజిటేబుల్‌ ఫ్రైడ్‌ రైస్‌ ఏర్పాటు చేస్తున్నారు.

సభ్యత్వం

వైహెచ్‌ఏఐ ఐదు రకాల సభ్యత్వాన్ని అందిస్తోంది. జీవితకాల సభ్యత్వం, సీనియర్‌(ఏడాది, రెండేళ్లు), జూనియర్‌(ఏడాది), వైహెచ్‌ఏఐ, ఐవైటీసీకో బ్రాండెడ్‌, ఇన్‌స్టిట్యూషనల్‌ సభ్యత్వం ఇస్తుంది. దేశవ్యాప్తంగా రెండు లక్షల మంది సభ్యులు ఉండగా.. ఇందులో లక్ష మంది జీవితకాల సభ్యత్వం కలిగి ఉన్నారు. అసోసియేషన్‌ ఆధ్వర్యంలో జాతీయ, రాష్ట్ర స్థాయిలో, వారాంతపు కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. సభ్యులు ఆయా కార్యక్రమాల్లో పాల్గొనే అవకాశం కల్పిస్తారు. కార్యక్రమాల షెడ్యూల్‌, ప్యాకేజీ, సభ్యుల సంఖ్యను వెబ్‌సైట్‌లో ప్రకటిస్తారు. వెళ్లాలనుకునే వారు అందులో నమోదు చేసుకోవాలి. ఎంత చార్జీ, ఎన్ని రోజులు, ఏ ప్రాంతం, ఎక్కడికి రావాలి, పాటించాల్సిన నిబంధనలు సూచిస్తారు. సందర్శించే ప్రాంతాన్ని బట్టి ఎన్ని రోజులు అనేది నిర్ణయిస్తారు. అక్కడికి చేరుకున్న పర్యాటకులకు ముందుగానే శిక్షణ ఇచ్చి స్థానిక వాతావరణానికి అలవాటు పడేలా సూచనలు చేస్తారు.

తొమ్మిది యూనిట్లు

రాష్ట్రంలో తొమ్మిది యూనిట్లు ఉన్నాయి. మంచిర్యాల జిల్లాలోని బెల్లంపల్లి యూనిట్‌తోపాటు సైబరాబాద్‌, గ్రేటర్‌ హైదరాబాద్‌ అడహక్‌, హైదరాబాద్‌, మేడ్చల్‌ మల్కాజ్‌గిరి, మియాపూర్‌, సికింద్రాబాద్‌, తెలంగాణ బీటీ ఎస్‌ఆర్‌, విహంగ మహిళా అడహక్‌ యూనిట్‌ ఉన్నాయి. ఆసక్తి గల వారు ఆయా యూనిట్లలో సభ్యత్వం తీసుకుని విహార యాత్ర కార్యక్రమాల్లో పాల్గొనవచ్చు. ఆన్‌లైన్‌, యూనిట్‌ ద్వారా బుక్‌ చేసుకోవాలి. యూనిట్లు నిర్ణయించిన తేదీల్లో పర్యటనకు సూచించిన స్థలానికి మన చార్జీలతో చేరుకోవాల్సి ఉంటుంది. అక్కడి నుంచి పర్యటన పూర్తయ్యే వరకు వసతి సౌకర్యం, ఆహారం నిర్ణయించిన ప్యాకేజీ రుసుంలోనే కల్పిస్తారు.



గోవాలోని జలపాతం

బెల్లంపల్లిలోనూ యూత్‌ హాస్టల్‌

బెల్లంపల్లిలోనూ యూత్‌ హాస్టల్‌ను ఏర్పాటు చేశారు. వైహెచ్‌ఏఐ విజ్ఞప్తి మేరకు సింగరేణి సంస్థ బెల్లంపల్లిలో ఓ భవనాన్ని యూత్‌ హాస్టల్‌ కోసం అద్దెకు కేటాయించింది. ట్రెక్కింగ్‌కు వెళ్లడానికి వివిధ రాష్ట్రాల నుంచి వచ్చి ఇక్కడ బస చేస్తారు. గాంధారిఖిల్లా, కుమురంభీం జిల్లా తిర్యాణి జలపాతాలు, జోడేఘాట్‌, ఆదిలాబాద్‌ అటవీ ప్రాంతం ట్రెక్కింగ్‌ కోసం వెళ్తారు.

ఆదిలాబాద్‌లో నిర్వహణకు సన్నాహాలు



బెల్లంపల్లి యూనిట్‌లో 170మంది సభ్యులు ఉన్నారు. జాతీయస్థాయిలో కొన్ని కార్యక్రమాలు ఉంటాయి. ట్రెక్కింగ్‌, బైకింగ్‌, సైక్లింగ్‌, బోటింగ్‌, ఫ్యామిలీ, చిల్డ్రన్స్‌ క్యాంప్‌ రకరకాలు ఉంటాయి. గోవాలో మాన్‌సూన్‌ ట్రెక్కింగ్‌, ఉత్తరాఖండ్‌లోని వ్యాలీ ఆఫ్‌ ఫ్లవర్స్‌కు వెళ్లొచ్చాం. జైసల్మేర్‌లో ఫ్యామిలీ క్యాంప్‌నకు వెళ్లాం. భార్యాభర్తలు, 12ఏళ్లలో పిల్లలకు కలిపి ఒక టెంటు ఇస్తారు. నాలుగు రాత్రులు, ఐదు పగళ్లు ఉండడానికి వసతి సౌకర్యం, ఆహారానికి అంతా కలిపి రూ.7వేల నుంచి రూ.8వేలు చార్జీ చేస్తారు. ఈ క్యాంప్‌లు ఊటి, కులూ, మున్నార్‌లో కూడా ఉంటాయి. గత వేసవిలో హిమాచల్‌ప్రదేశ్‌లోని డోలారిపాస్‌, లడక్‌లో మోటార్‌సైక్లింగ్‌కు వెళ్లాం. హిమాచల్‌ప్రదేశ్‌లో డలోహసి ట్రెక్కింగ్‌కు వెళ్లాం. సైక్లింగ్‌కు వెళ్లినప్పుడు సైకిల్‌ సౌకర్యం కూడా కల్పిస్తారు. ఉత్తరాఖండ్‌ వంటి ప్రాంతానికి వెళ్లినప్పుడు స్థానిక వాతావరణానికి అలవాటు పడడానికి చిన్న చిన్న ప్రదేశాలకు తీసుకెళ్తారు. తిరుమల తిరుపతి అడవుల్లో కూడా ఒక ట్రెక్కింగ్‌ నిర్వహిస్తారు. కపిలతీర్థం, రామకృష్ణ తీర్థం కూడా చూడవచ్చు. జాతీయ స్థాయిలో వెళ్లిన ట్రెక్కింగ్‌లకు రాజస్తాన్‌, గుజరాత్‌, గోవా, కేరళ తదితర రాష్ట్రాల నుంచి వచ్చిన వారు స్నేహితులయ్యారు. ఉమ్మడి ఆదిలాబాద్‌ జిల్లాలోని 50కిలోమీటర్ల పరిధిలో పది నుంచి 12 జలపాతాలు ఉన్నాయి. అటవీశాఖ అధికారుల సహకారంతో నాలుగు రోజుల కార్యక్రమం ఆగస్టు తర్వాత నిర్వహణకు సన్నాహాలు చేస్తున్నాం.

–శ్యాంసుందర్‌రెడ్డి, వైహెచ్‌ఏఐ తెలంగాణ వైస్‌ప్రెసిడెంట్‌, మంచిర్యాల

జీవితంలో మార్పునకు దోహదం



కొత్త కొత్త ప్రాంతాల్లో ట్రెక్కింగ్‌, సైక్లింగ్‌ అనేది జీవితంలో మార్పుకు దోహదపడుతుంది. గోవా, హిమాచల్‌ప్రదేశ్‌లోని డల్హౌసి, ఛత్తీస్‌గఢ్‌లోని జగ్దల్‌పూర్‌, మహారాష్ట్రలోని మహాబలేశ్వర్‌లో ట్రెక్కింగ్‌కు వెళ్లొచ్చాను. యూత్‌ హాస్టల్‌లో సభ్యులుగా ఉండడం వల్ల చాలా తక్కువ మొత్తంలోనే వివిధ ప్రాంతాలు సందర్శించి రావచ్చు. 2018లో మొదటిసారి హిమాచల్‌ప్రదేశ్‌లో ట్రెక్కింగ్‌కు వెళ్లొచ్చాను. మానసిక ఒత్తిడి నుంచి చాలా ప్రశాంతత పొందాను. బెంగళూర్‌, మహారాష్ట్ర, హిమాచల్‌ప్రదేశ్‌, ఆంధ్రప్రదేశ్‌, కేరళ, ఢిల్లీ తదితర రాష్ట్రాల నుంచి వచ్చిన కొందరు స్నేహితులు అయ్యారు. విద్యావంతులు, వ్యాపారవేత్తలు వస్తుంటారు. ఒకరి ఆలోచనలు మరొకరు పంచుకోవడం వల్ల వ్యక్తిగతంగా, వ్యాపారపరంగా ఎంతో ప్రయోజనం కలుగుతుంది. గోవా అంటే మద్యం, పబ్బులు అనుకుంటారు కానీ పది జలపాతాలు ఉన్నాయి. 12వేల అడుగుల పైకి ట్రెక్కింగ్‌ చేస్తూ వెళ్లి జలపాతాలు చూడొచ్చు. నేను ఇప్పటివరకు వెళ్లొచ్చిన ట్రెక్కింగ్‌లకు ఒక్కోదానికి రూ.6వేల నుంచి రూ.7వేల వరకు ఖర్చయింది. ఐదు రోజులు ఆహారం, స్థానికంగా రవాణా, బస సౌకర్యం కల్పిస్తారు. ప్రతీ సంవత్సరం వెళ్లొస్తుంటాను. జీవితంలో మార్పు కోరుకునే యువత ట్రెక్కింగ్‌లకు వెళ్లాలి. వ్యక్తిత్వ వికాసానికి దోహదపడుతాయి.

– కొండగొర్ల చంద్రశేఖర్‌, బెల్లంపల్లి

ఆదివాసీలు సంఘటితం కావాలి

- రిటైర్డ్‌ జాయింట్‌ కలెక్టర్‌ వీరమల్లు



మాట్లాడుతున్న రిటైర్డ్‌ జాయింట్‌ కలెక్టర్‌ వీరమల్లు

బోథ్‌: ఆదివాసీల మనుగడ కోసం జిల్లాలోని తొమ్మిది తెగలు ఆదివాసీలు సంఘటితం కావాలని రిటైర్డ్‌ జాయింట్‌ కలెక్టర్‌ విరమల్లు పిలుపునిచ్చారు. బోథ్‌ మండలంలోని పట్నాపూర్‌ గ్రామంలో న్యాయవాది పంద్రం శంకర్‌ అధ్యక్షతన శనివారం నిర్వహించిన సమావేశానికి హాజరై ప్రసంగించారు. ఏప్రిల్‌ 5,6,7 తేదీల్లో భద్రాద్రి కొత్తగూడెంలో నిర్వహించే ఆదివాసీ తెగల మనుగడ, సంస్కృతి పరిరక్షణ కోసం జిల్లాలోని ఆదివాసీలందరూ హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. పోడు భూములు 1/70 పీసా ఏజెన్సీ చట్టాల అమలు వాటి ఆవశ్యకతపై వివరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సమన్వయకర్త చెంచు రామకృష్ణ, రిటైర్డ్‌ ఏఎస్పీ సెడ్మాకి గొద్రు, రిటైర్డ్‌ డిప్యూటీ కలెక్టర్‌ కుమురం ప్రసాద్‌, రాష్ట్ర ఉపాధ్యక్షులు మంకిడి బుచ్చయ్య, గోడం మోతిరం, కొడప కోసేరావు, ఆదిలాబాద్‌ జిల్లా సమన్వయకర్త గోడం మనోహర్‌, సార్మెడి ఆడేం భీంరావ్‌, కొండిబా, తుడుందెబ్బ జిల్లా ఉపాధ్యక్షులు రామెల్లి భోజన్న ఉన్నారు.

28న బాసర ఆలయ హుండీ లెక్కింపు

భైంసా: బాసర శ్రీజ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయ హుండీ ఈనెల 28న లెక్కించనున్నట్లు ఆలయ ఈవో విజయ రామారావు శనివారం ఒక తెలిపారు. ఉదయం 9గంటలకు హుండీ లెక్కింపు ప్రారంభమవుతుందని పేర్కొన్నారు.సిబ్బంది, బ్యాంకు అధికారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

ఆదరణ చూసి ఓర్వలేక కేసులు



సమావేశంలో మాట్లాడుతున్న వెడ్మ బొజ్జు

ఇంద్రవెల్లి: దేశ వ్యాప్తంగా రాహుల్‌గాంధీకి వస్తున్న ఆధారణను చూసి ఓర్వలేకనే అనర్హ త వేటు వేశారని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెడ్మ బొజ్జు అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తమ నాయకుడిపై ఎన్ని కే సులు పెట్టినా కాంగ్రెస్‌ పార్టీ ఎదుర్కొనేందు కు సిద్ధంగా ఉందని వివరించారు. దేశ సంపదను అదానీ, అంబానీలకు దోచి పెడుతు న్నా.. ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న బీజేపీ తీరును వ్యతిరేకిస్తూ మాట్లాడిన రాహుల్‌ గాంధీపై ప్రధాని కావాలనే కుట్ర చేశారని మండిపడ్డారు. ఇందులో జహీర్‌, వెంకట్‌రావ్‌, జితేందర్‌, భగవాన్‌ ఉన్నారు.

'బీఆర్‌ఎస్‌కు మూడోసారి విజయం ఖాయం'

- బీఆర్‌ఎస్‌ పార్టీ ఆత్మీయ సమ్మేళనం

ఉట్నూర్‌రూరల్‌: మూడోసారి బీఆర్‌ఎస్‌ పార్టీ విజయం ఖాయమని ఖానాపూర్‌ ఎమ్మెల్యే, రేఖానాయక్‌, ఎమ్మెల్సీ గంగాధర్‌గౌడ్‌ అన్నారు. శనివారం మండంలోని శ్యాంపూర్‌ గ్రామంలో బీఆర్‌ఎస్‌ పార్టీ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఖానాపూర్‌ నియోజకవర్గం అభివృద్ధిలో కార్యకర్తలే కీలకమన్నారు. బీఆర్‌ఎస్‌ పార్టీ ప్రవేశపెట్టిన ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలను ప్రజల్లోకి మరింతగా తీసుకెళ్లాలని కోరారు. నియోజకవర్గ అభివృద్ధిలో కార్యకర్తలే కీలకపాత్ర పోషిస్తూ మూడోసారి విజయమందించడమే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. పార్టీ, పదవులని చూడకుండా అందరూ కలిసికట్టుగా పార్టీ కోసం పనిచేయాలని కోరారు. సంక్షేమ పథకాలు ప్రజలకు అందిస్తుంటే ఓర్వలేక ప్రతిపక్షాలు బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. బీజేపీ నాయకులు కేంద్రం నుంచి నిధులు తీసుకువచ్చి అభివృద్ధి చేసి చూపించాలని సూచించారు. రానున్న రోజుల్లో దళితబంధు, భూమి ఉండి ఇల్లు కట్టుకునే వారికి రూ.3లక్షలు అందించనున్నట్లు పేర్కొన్నారు. బీఆర్‌ఎస్‌ పార్టీ ప్రారంభించిన తరువాత దేశంలో పార్టీకి ఆదరణ పెరుగుతోందని వివరించారు. 27న పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకునేందుకు తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్‌ రాష్ట్ర నాయకులు రోకండ్ల రమేశ్‌, డీసీసీబీ చైర్మన్‌ భోజన్న, ఎంపీపీ జైవంత్‌రావు, ఇంద్రవెల్లి మార్కెట్‌ కమిటీ చైర్మన్‌ శ్రీరాం, ప్రభాకర్‌రెడ్డి, వైస్‌ ఎంపీపీ దావులే బాలాజీ, సర్పంచ్‌లు మల్లిక, హరినాయక్‌, నాయకులు అజీమొద్దీన్‌, ధరణి, రాజేశ్‌ ఉన్నారు.



శ్యాంపూర్‌లో మాట్లాడుతున్న గంగాధర్‌ గౌడ్‌

కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి..

తలమడుగు: వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ పార్టీని గెలిపించేందుకు కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని జిల్లా ఇన్‌చార్జి, ఎమ్మెల్యే గంగాధర్‌గౌడ్‌ అన్నారు. శనివారం మండలంలోని కజ్జర్ల గ్రామంలో బీఆర్‌ఎస్‌ పార్టీ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ పార్టీకి హ్యాట్రిక్‌ విజయానికి కార్యకర్తలు ఇప్పటి నుంచి కృషి చేయాలని కోరారు. ప్రతిపక్షాల ఆరోపణలను ఎప్పటికప్పుడు తిప్పికొట్టాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ, అభివృద్ధి పనులపై ప్రజలకు వివరించాలన్నారు. అనంతరం ఎమ్మెల్యే బాపురావు మాట్లాడుతూ దేశంలోని ఏ రాష్ట్రంలో లేనివిధంగా తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో బోథ్‌ నియోజవర్గ అధికార ప్రతినిధి మొట్టె కిరణ్‌ కుమార్‌, గ్రామ పెద్దలు, దేవా రెడ్డి, రైతుబంధు సమన్వయ కర్త గోక జీవన్‌రెడ్డి, మండల కన్వీనర్‌ తోట వెంకటేష్‌, ఉపాధ్యక్షులు ప్రకాష్‌, గ్రామ సర్పంచ్‌, వెంకటమ్మ, వెల్మ శ్రీనివాసరెడ్డి, కాటిపెల్లి శ్రీనివాస్‌రెడ్డి, ఆశన్న యాదవ్‌, చంటి పాల్గొన్నారు.



తలమడుగు: ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేను సన్మానించిన నాయకులు

ఈతకు వెళ్లి యువకుడి గల్లంతు



పూసం పవన్‌ (ఫైల్‌)

నిర్మల్‌టౌన్‌: చెరువులో ఈ తకొడుతూ యువకుడు గల్లంతైన సంఘటన జిల్లా కేంద్రంలో శనివారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం... బాలాజీవా డకు చెందిన పూసం పవన్‌(28) ప్రస్తుతం ధ్యాగవాడలో అద్దెఇంట్లో నివాసముంటున్నాడు. ఐదేళ్ల క్రితం కురన్నపేట్‌కు చెందిన ఝాన్సీని ప్రేమ వివాహం చే సుకున్నాడు. వీరికి నాలుగేళ్ల కుమారుడు ఉండగా, ప్రస్తుతం భార్య నాలుగు నెలల గర్భవతి. పవన్‌ కూ లీ పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అయితే శనివారం ఉదయం స్నేహితుడితో కలిసి.. స్థానిక కురన్నపేట్‌ చెరువు పక్కనేగల గుడిసెలో మద్యం తాగారు. అతడి స్నేహితుడు పని ఉందని వెళ్తానని చెప్పగా అతడి వద్ద రూ.500 తీసుకున్నాడు. ఆ త ర్వాత ఒక్కడే మళ్లీ మద్యం తాగాడు. మత్తులో చెరువులో ఈత కొట్టడానికి వెళ్లి ప్రమాదవశాత్తు మునిగి పోయాడు. గమనించిన స్థానికులు కుటుంబీకులకు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్సై జ్యోతిన్మ యి సిబ్బందితో చేరుకుని గజ ఈతగాళ్ల సాయంతో గాలింపు చర్యలు కొనసాగిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మల్లేశ్‌ పేర్కొన్నారు.

'చాకిరేవు'కు సోలార్‌ వెలుగులు



సోలార్‌తో వెలుగుతున్న విద్యుత్‌ కాంతుల్లో చాకిరేవు గ్రామస్తులు



చాకిరేవులో ఏర్పాటు చేస్తున్న సోలార్‌ ప్లేట్లు

- 'ఆహా' ఆధ్వర్యంలో ఏర్పాటు
- 15 కుటుంబాల్లో ఆనందం

పెంబి: హీరో బాలకృష్ణ నిర్వహించిన ఆహా కార్యక్రమంలో ప్రోగ్రాంలో నిర్మల్‌ జిల్లా పెంబి మండలం దొందారి గ్రామ పంచాయతీ పరిధిలోని చాకిరేవు గ్రామ ప్రస్తావన డిసెంబర్‌ 26న తీసుకొచ్చారు. చాకిరేవు గ్రామస్తులు ఆ కార్యక్రమంలో వారి సమస్యలు తెలిపారు. హీరో బాలకృష్ణ చాకిరేవు గ్రామానికి ఆహా ప్రోగ్రాం ద్వారా గ్రామాభివృద్ధికి రూ.లక్ష చెక్కును అందించడమే కాకుండా గ్రామంలోని 15 కుటుంబాల ఇళ్లకు విద్యుత్‌ అందించేందుకు సోలార్‌ సిస్టం ఏర్పాటు చేయిస్తామని హామీ ఇచ్చిన విషయం తెలిసినదే. దీంతో శుక్రవారం 'ఆహా' బృందం చాకిరేవు గ్రామానికి చేరుకుని సోలార్‌ ఎనర్జీ సిస్టం ఏర్పాటు చేసి ప్రతి ఇంటికి బల్బులు, స్విచ్‌ బోర్డులు ఏర్పాటు చేసి వెలుతురు ప్రసరించేలా చేశారు. చీకటిలో మగ్గుతున్న మా గ్రామానికి వెలుగునిచ్చిన హీరో బాలకృష్ణకి, 'ఆహా' బృందానికి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. ఇందులో టీఏజీఎస్‌ జిల్లా కార్యదర్శి తోడసం శంభు, గ్రామస్తులు ఉన్నారు.

డ్రంకెన్‌డ్రైవ్‌లో ఐదుగురికి జైలు

ఖానాపూర్‌: మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడిన ఐదుగురికి కోర్టు ఒక్కరోజు జైలు శిక్ష విధించినట్లు ఎస్సై ఆర్‌.శంకర్‌ తెలిపారు. పోలీసు శాఖ చేపట్టిన డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుబడిన వారిని శనివారం ఖానాపూర్‌ కోర్టులో జ్యుడీషియల్‌ ఫస్ట్‌ క్లాస్‌ మేజిస్ట్రేట్‌ ఎదుట హాజరు పరిచారు. వా రికి కోర్టు పైవిధంగా శిక్ష ఖరారు చేసింది. మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని తెలిపారు.

అనారోగ్యంతో ఎంపీడీవో మృతి



శివలాల్‌ భుక్యా (ఫైల్‌)

ఆదిలాబాద్‌రూరల్‌: అనారోగ్యంతో ఆదిలాబాద్‌రూరల్‌ ఎంపీడీవో శివలాల భుక్యా శనివారం మృతిచెందింది. జన్నారం మండలం రేండ్లగూడ గ్రామ పంచాయతీ పరిధిలోని రూప్‌నాయక్‌ తండాకు చెందిన శివలాల్‌ ఉట్నూర్‌ మండల కేంద్రంలో నివాసం ఉంటున్నాడు. నార్నూర్‌ మండల ఎంపీవోగా పనిచేస్తున్న క్రమంలో ఆయనకు ఎంపీడీవోగా పదోన్నతి వచ్చింది. దీంతో ఆయన 2020లో ఆదిలాబాద్‌ రూరల్‌ ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించారు. కొన్ని నెలల పాటు ఎంపీడీవోగా కొనసాగగా అనారోగ్యానికి గురయ్యాడు. ఆరోగ్యం క్షీణించడంతో దీర్ఘకాలిక సెలవులో ఉన్నాడు. ఆరోగ్యం పూర్తిగా క్షీణించి శనివారం మృతి చెందాడు. అంత్యక్రియలు సొంత గ్రామమైన రూప్‌నాయక్‌ తండాలో నిర్వహించగా మండల అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

గుండెపోటుతో డ్రైవర్‌ మృతి



కద్దార్‌ సింగ్‌ (ఫైల్‌)

బోథ్‌: మండలంలోని సొనాల గ్రామానికి చెందిన కద్దార్‌ సింగ్‌(45) అనే ట్రాక్టర్‌ డ్రైవర్‌ గుండెపోటుతో మృతిచెందాడు. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం... సొనాల నుంచి ట్రాక్టర్‌లో శుక్రవారం సా యంత్రం శనగలను మార్కెట్‌ యార్డుకు తీసుకొచ్చి అక్కడే ఉన్నాడు. రాత్రి 11.30గంటల ప్రాంతంలో గుండెపోటు రావడంతో గమనించిన స్థానికులు వెంటనే స్థానిక ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతిచెందాడు.